వైఎస్ఆర్ విగ్రహానికి ముసుగు

చిలిపిచెడ్(కొల్చారం), ఏప్రిల్ 19: ఎన్నికల కోడ్ అమల్లోకి వచ్చినప్పటికీ గ్రామాల్లో నాయకుల ఫొటోలు, శిలాఫలకాలకు నామమాత్రంగా ముసుగులు వేశారని 'నమస్తే తెలంగాణ'లో శుక్రవారం వచ్చిన కథనానికి అధికారులు స్పందించారు. కొల్చారం మండలం ఘనపూర్‌లో మెదక్-సంగారెడ్డి ప్రధాన రోడ్డు పక్కన వైఎస్సార్ రాజశేఖర్‌రెడ్డి విగ్రహానికి పూర్తిగ ముసుగు వేశారు.

రామాలయంలో స్వామికి చక్రస్నానం

స్వామివారికి సమర్పించిన కలశాలు

రామాయంపేట, ఏప్రిల్ 19: రామాయంపేటలోని పాండు చెర్వు కట్ట వద్ద ఉన్న రామాలయంలో శుక్రవారం స్వామివారికి శత కలశాలతో చక్రస్నానం చేయించారు. కార్యక్రమంలో బ్రాహ్మణులు కూర్మాచలం సత్యనారాయణ, రాఘవ, శ్రీనివాసాచార్యులు పాల్గొన్నారు.

ఘనంగా పోచమ్మ, ఊరడమ్మ విగ్రహాల ప్రతిష్ఠాపన

అవధూతను సన్మానిస్తున్న గ్రామస్తులు

వట్‌పల్లి, ఏప్రిల్ 19: మండలంలోని ఉసిరికెపల్లి గ్రామంలో పోచమ్మ, ఊరడమ్మ విగ్రహాల ప్రతిష్ఠాపనను శుక్రవారం ఘనంగా నిర్వహించారు. ఈ ఉత్సవాలకు బర్దిపూర్ పీఠాధిపతి అవధూత మహరాజ్ హాజరయ్యారు. ఆయనను గ్రామస్తులు, ఆలయ కమిటీ సభ్యులు ఘనంగా సన్మానించారు.

పిడుగు పడి రెండు గేదెలు మృతి

పిడుగుపాటుతో మృతిచెందిన పాడి గేదెలు

అల్లాదుర్గం, ఏప్రిల్ 19: మండలంలోని పలు గ్రామాల్లో అకాల వర్షంతో చెట్లు కూలిపోయాయి. పిడుగుపడి రెండు పాడి గేదెలు మృతిచెందాయి. మండలంలోని ఐబీ తండాకు చెందిన వర్త్య సక్కుబాయి, మారుతి దంపతుల రెండు పాడి గేదెలను మేతకోసం వ్యవసాయ పొలంలోకి శుక్రవారం తీసుకెళ్లారు. మధ్యాహ్నం ఎండ తీవ్రత ఎక్కువగా ఉండడంతోఅక్కడే ఉన్న ఓ చెట్టు కింద వాటిని కట్టేసి ఇంటికి వెళ్లారు. కొంత సమయం తర్వాత గాలి దుమారం, ఉరుములతో కూడిన వర్షం పడింది. వర్షం తగ్గిన తర్వాత పశువుల వద్దకెళ్లి చూడగా మృతి చెంది ఉన్నాయి. రూ.1.50 లక్షల విలువైన పాడిగేదెలు మృతి చెందడంతో తాము జీవనోపాధి కోల్పోయామని బాధితులు తెలిపారు. గడి పెద్దాపూర్, మందాపూర్, చిల్వెర, అల్లాదుర్గం తదితర ప్రాంతాల్లో చేతికొచ్చిన పంటలు దెబ్బతిన్నాయి. అల్లాదుర్గం-వెంకట్‌రావుపేట రహదారిపై భారీ వేప చెట్టు కూలింది. దీంతో ఆ దారిన రాకపోకలు స్తంభించిపోయాయి.

నమస్తే తెలంగాణ క్లాసిఫైడ్స్
WANTED
★హరేకృష్ణ హోంకేర్ హైదరాబాద్ నందు వృద్ధులను, పేషెంట్స్‌ను చూసుకొనుటకు వర్కర్స్, నర్సులు కావలెను. ఉచిత వసతి భోజనం. జీతం: 16K to 18K, ఏజెంట్ కమీషన్ 6K Ph: 9640258899/9640468899
NT-311829
గమనిక: క్లాసిఫైడ్ ప్రకటనలకు ప్రతిస్పందించే ముందు తగిన రీతిలో క్షుణ్ణంగా విచారించుకోవలసిందిగా పాఠకులకు సూచించడమైనది. ప్రకటనదారు చెబుతున్న, లేదా చేసుకుంటున్న క్లెయిములతో నమస్తే తెలంగాణ పత్రికకు ఏ విధమైన సంబంధం లేదు. బ్యాంక్ అకౌంట్ల ద్వారా డబ్బులు ట్రాన్స్‌ఫర్/డిపాజిట్ చేయవద్దు. పాఠకులు ఈ విషయాన్ని గమనించగలరు.

కొనుగోలు కేంద్రాల్లో వసతులేవీ?

రామాయంపేట పురపాలిక పరిధిలోని గిరిజన తండా వద్ద ఏర్పాటు చేసిన కొనుగోలు కేంద్రం

- మండుటెండల్లో రైతుల అగచాట్లు
- తాగేందుకు నీరు లేదు, నీడ కోసం టెంటూ లేదు
- ఇది ఐకేపీ కేంద్రం నిర్వాహకుల పరిస్థితి

రామాయంపేట, ఏప్రిల్ 19: ధాన్యం కొనుగోలు కేంద్రాల్లో కనీస వసతులు కరువయ్యాయి. తాగడానికి నీళ్లుండవు. నీడ కోసం టెంటూ వేయరు. ధాన్యం తీసుకొచ్చిన రైతులు చెట్ల కింద పుట్ల కింద వేచి చూడాల్సిన దుస్థితి దాపురించింది. రామాయంపేట పురపాలిక పరిధిలోని గిరిజన తండా వద్ద ప్రభుత్వ అధికారులు మండుటెండలోనే ధాన్యం తూకం వేస్తుండడంతో రైతులు అల్లాడుతున్నారు. కొనుగోలు కేంద్రం ప్రారంభించిన అధికారులు అక్కడ సౌకర్యాలు ఏర్పాటు చేయడంలో పూర్తిగా విఫలమయ్యారు.

ఎండలో అల్లాడుతున్నం..

కొనుగోలు కేంద్రం వద్ద కనీసం తాగడానికి నీళ్లు పెట్టలేదు. ఎండలోనే ఉంటున్నాం. నిలబడదామన్నా నీడ లేదు. చెట్ల నీడనే దిక్కైతున్నది. ఇంటి నుంచి తెచ్చుకున్న నీళ్లు అయిపోతే కొనుక్కోవాల్సిందే..

- రొయ్యల వెంకటి, రైతు, కోమటిపల్లి

తాగేందుకు నీళ్లు లేవు

కొనుగోలు కేంద్రం వద్ద అధికారులు తాగేందుకు నీళ్లు కూడా పెట్టలేదు. కూర్చునేందుకు గింత నీడ లేదు. చెట్ల కింద కూసుంటున్నం. ఒక పక్క ఎండలు మండి పోతున్నయి. ఇప్పటికైనా అధికారులు నీళ్లు, నీడ కల్పించాలి.

- కొక్కు మరియ, రైతు, కోమటిపల్లి

ఎండలో పడిగాపులు పడుతున్నం

ఎర్రటి ఎండలోనే మా ధాన్యం తూకం కోసం పడిగాపులు పడుతున్నం. కొనుగోలు కేంద్రం వద్ద అధికారులు కనీస వసతులు కల్పించడం లేదు. ఇంటి నుంచి తెచ్చుకున్న నీళ్లయిపోతే పేటకు పోయి కొనుకొచ్చుకుంటున్నం. కేంద్రం వద్ద నీళ్ల వసతిలేదు, టెంటు కూడా వెయ్యలేదు.

- లంబాడీ గోవింద్, రైతు, కోమటిపల్లి తండా

మెదక్ గడ్డపై కాంగ్రెస్ జెండా ఎగురవేస్తాం

- రాష్ట్రంలో 15 ఎంపీ స్థానాలు గెలవడమే లక్ష్యం
- మంత్రి కొండా సురేఖ
- మెదక్‌లో సీఎం సభ ఏర్పాట్లు పరిశీలన

మాట్లాడుతున్న మంత్రి కొండా సురేఖ



వధూవరులను ఆశీర్వదిస్తున్న మంత్రి, తదితరులు

మెదక్, ఏప్రిల్ 19 (నమస్తే తెలంగాణ): మెదక్ నియోజకవర్గాన్ని అభివృద్ధి చేసిన చరిత్ర కాంగ్రెస్‌కు, మెదక్ ఎంపీగా ఇందిరాగాంధీకి ఉన్నదని రాష్ట్ర అటవీ, పర్యావరణ, దేవాదాయ శాఖల మంత్రి, మెదక్ పార్లమెంట్ ఇన్‌చార్జి కొండా సురేఖ అన్నారు. శుక్రవారం మెదక్‌లో సీఎం సభ ఏర్పాట్లను మాజీ ఎమ్మెల్యే మైనంపల్లి హన్మంత్ రావు, ఎంపీ అభ్యర్థి నీలం మధుతో కలిసి పరిశీలించారు. అనంతరం మీడియాతో మాట్లాడుతూ రాష్ట్రంలో 15 ఎంపీ స్థానాలు గెలవడమే లక్ష్యంగా పెట్టుకున్నామన్నారు. మెదక్ లోక్ సభ స్థానం ఎంతో చారిత్రాత్మకమైందన్నారు. ఇందిరాగాంధీ ఇక్కడి నుంచి ఎంపీగా గెలిచి ప్రధానమంత్రి అయ్యారన్నారు. ఈసారి మెదక్‌లో పక్కాగా కాంగ్రెస్ జెండా ఎగురవేస్తామన్నారు. కార్యకర్తలు, నాయకులు, పార్టీ ఇన్‌చార్జిలు విజయం సాధించేవరకు విశ్రమించకుండా పనిచేయాలన్నారు.

రాహుల్ ప్రధాని కావడం ఖాయం

రాహుల్‌గాంధీ ప్రధానమంత్రి కావడం ఖాయమని మాజీ ఎమ్మెల్యే మైనంపల్లి హన్మంత్‌రావు అన్నారు. దేవుళ్లతో రాజకీయాలు చేస్తే మటాష్ అవుతారన్నారు. అన్ని మతాలను గౌరవించేది కాంగ్రెస్ అన్నారు. లోక్‌సభ ఎన్నికల్లో బీజేపీని ఓడగొట్టి కేంద్రంలో కాంగ్రెస్ ప్రభుత్వం ఏర్పాటు చేస్తామన్నారు. కాంగ్రెస్ బీసీలకు అవకాశం ఇచ్చిందని, ముదిరాజ్‌లు తమ సత్తా చాటాలన్నారు. ఎంపీగా నీలం మధును భారీ మెజార్టీతో గెలిపించాలన్నారు. సమావేశంలో నాయకులు ఆంజనేయులు గౌడ్, చంద్రపాల్, సుప్రభాతరావు, రాజిరెడ్డి, జీవన్‌రావు, రమేశ్‌రెడ్డి, బొజ్జ పవన్, ఉప్పల రాజేశ్, మహిపాల్ రెడ్డి, మధుసూదన్‌రావు తదితరులు పాల్గొన్నారు.

వధువరులను ఆశీర్వదించిన మంత్రి

మెదక్ మున్సిపాలిటీ, ఏప్రిల్ 19: జిల్లా కేంద్రంలోని వెంకటేశ్వర గార్డెన్‌లో పాపన్నపేటకు చెందిన నీరుడి వెంకట్ కుమారుడి వివాహం శుక్రవారం జరిగింది. ఈ వివాహానికి మంత్రి కొండా సురేఖ, మాజీ ఎమ్మెల్యే మైనంపల్లి హన్మంత్‌రావు, మెదక్ ఎంపీ కాంగ్రెస్ అభ్యర్థి నీలం మధు, రాజిరెడ్డి తదితరులు హాజరై వధూవరులను ఆశీర్వదించారు.

అతివల ఆరోగ్యానికి భరోసా

- జిల్లాలోని 13 కేంద్రాల్లో కొనసాగుతున్న కార్యక్రమం
- ఈ ఏడాదిలో 55,600 మందికి పరీక్షలు

మెదక్, ఏప్రిల్ 19 (నమస్తే తెలంగాణ): ప్రభుత్వం ఆరోగ్య మహిళా పథకంలో ఉచితంగా వివిధ రకాల పరీక్షలు చేస్తూ వారిలోని వ్యాధులు గుర్తించి చికిత్స అందిస్తూ అతివల ఆరోగ్యానికి భరోసాగా నిలుస్తున్నది. గత ఏడాది మార్చి నుంచి ప్రస్తుత ఏప్రిల్ వరకు 55,600 మంది మహిళలకు అన్ని రకాల వైద్య పరీక్షలు చేశారు. కొందరికి అవసరమైన చికిత్స చేయగా, మరికొందరిని జిల్లా కేంద్ర దవాఖానకు రెఫర్ చేశారు. జిల్లాలో ఎంపిక చేసిన 13 పీహెచ్‌సీల్లో వైద్య పరీక్షలు చేస్తున్నారు. ఆయా సెంటర్లకు వచ్చిన మహిళల్లో ఏమైనా రుగ్మతలుంటే వారిని గుర్తించి జిల్లా కేంద్ర దవాఖానకు రెఫర్ చేస్తున్నారు.

మూడు విభాగాల్లో రోగుల వివరాలు

ఆరోగ్య కేంద్రాల్లో మూడు విభాగాల్లో వ్యాధిగ్రస్తుల వివరాలు నమోదవుతున్నాయి. ముందుగా ల్యాబ్‌లో ఆధార్, ఫోన్ నంబర్ నమోదు చేస్తారు. అక్కడే షుగర్, బీపీ పరీక్షలు చేస్తారు. బరువు, ఎత్తు కొలతలు తీస్తారు. రెండో విభాగంలో వ్యాధుల లక్షణాలు, సమస్యలు తెలుసుకుంటారు. అనుమానితుల నుంచి రక్త, మూత్ర నమూనాలు సేకరిస్తారు. పరీక్షల వివరాలను ఆన్‌లైన్‌లో నమోదు చేస్తారు. థైరాయిడ్, క్యాన్సర్, ఇతర రోగాల స్క్రీనింగ్, సూక్ష్మ పోషక లోపాలు గుర్తింపు, మూత్రనాళ ఇన్‌ఫెక్షన్లు, హార్మోన్ల సమతుల్యత, మోనోపాజ్, శరీర బరువు ఇలా 8 రకాల పరీక్షలు చేస్తున్నారు. రక్త నమూనాలు సేకరించి డయాగ్నాస్టిక్ కేంద్రాలకు తరలిస్తున్నారు. క్యాన్సర్, స్క్రీనింగ్ పరీక్షలు కూడా చేస్తున్నారు. అనుమానితులు, లక్షణాలు ఉన్న వారి బయోప్సీ, మెమోగ్రామ్, ఇతర పరీక్షల కోసం జిల్లా కేంద్ర దవాఖానకు సిఫార్సు చేస్తున్నారు.

13 పీహెచ్‌సీల్లో పరీక్షలు

ప్రతి మంగళవారం ఆరోగ్య మహిళా కార్యక్రమంలో స్త్రీలకు వైద్య పరీక్షలు చేస్తున్నాం. జిల్లాలోని 13 పీహెచ్‌సీల్లో కొనసాగుతున్నది. గతేడాది 55,600 మందికి పరీక్షలు చేశాం. 1380 మంది ని జిల్లా కేంద్ర దవాఖానకు రెఫర్ చేశాం. మహిళలు తప్పకుండా ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలి.

- డాక్టర్ శ్రీరాం, డీఎంహెచ్‌వో, మెదక్

సర్వసభ్య సమావేశంలో సమయపాలన ఏదీ?

ఎంపీడీవో రాజిరెడ్డికి వినతి పత్రం అందజేస్తున్న ఎంపీటీసీలు,పీఏసీఎస్ చైర్మన్లు

నిజాంపేట, ఏప్రిల్ 19: నిజాంపేటలోని ఎంపీ కార్యాలయంలో ఎంపీపీ సిద్ధిరాములు ఆధ్వర్యంలో మండల సాధారణ సర్వ సభ్య సమావేశం నిర్వహించారు. ఈ సమావేశంలో అధికారులు గ్రామాల్లో జరుగుతున్న పనుల ప్రగతిని చదివి వినిపించారు. సమావేశం సమయపాలన పాటించకుండా నిర్వహించారని, మళ్లీ మరో రోజు నిర్వహించాలని ఎంపీటీసీలు బాల్‌రెడ్డి, రాజిరెడ్డి, లహరి, పీఏసీఎస్ చైర్మన్లు కొండల్‌రెడ్డి, బాపురెడ్డి, ఎంపీడీవో రాజిరెడ్డికి వినతి పత్రం అందజేశారు. కార్యక్రమంలో ఎంపీటీసీ సురేశ్, పశువైద్యాధికారి సుధాకర్ దేశ్‌ముఖ్, ఏఈవో కావేరి, మిషన్ భగీరథ ఏఈ భిక్షపతి పాల్గొన్నారు.

రమణీయంగా సీతారాముల రథోత్సవం

పెద్దశంకరంపేట, ఏప్రిల్ 19: శ్రీరామనవమి ఉత్సవాలను పురస్కరించుకుని పెద్దశంకరంపేటలో గురువారం అర్ధరాత్రి నుంచి శుక్రవారం వేకువ జామున వరకు సీతారాముల రథోత్సవం వైభవంగా నిర్వహించారు. సీతారామ లక్ష్మణ విగ్రహాలను రథంపై ఉంచి పురవీధుల గుండా భవానీ మాత ఆలయ కమాన్ వరకు ఊరేగించారు. ఎంపీపీ జంగం శ్రీనివాస్, ఆలయ కమిటీ అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు గుజ్జరి కనకరాజు, కందుకూరి రవీందర్, బీఆర్ఎస్ మండలాధ్యక్షుడు మురళీపంతులు, ఆలయ కమిటీ సభ్యులు సుభాశ్‌గౌడ్, రాగం సిద్దు, శ్రీను పాల్గొన్నారు.

అభ్యర్థుల వ్యయ రికార్డులు పటిష్టంగా నిర్వహించాలి

ఎన్నికల వ్యయ పరిశీలకుడు సునీల్ కుమార్ రాజ్ వాన్సీ

పాల్గొన్న ఏఆర్‌వోలు, నోడల్ అధికారులు, ఎన్నికల సిబ్బంది ఇన్‌సెట్‌లో మాట్లాడుతున్న సునీల్ కుమార్ రాజ్ వాన్సీ, కలెక్టర్ రాహుల్‌రాజ్

మెదక్, ఏప్రిల్ 19 (నమస్తే తెలంగాణ): ఎన్నికలకు సంబంధించిన వ్యయ రికార్డులను పటిష్టంగా నిర్వహించాలని వ్యయ పరిశీలకుడు సునీల్ కుమార్ రాజ్ వాన్సీ అధికారులను ఆదేశించారు. శుక్రవారం వ్యయ కలెక్టరేట్‌లోని సమావేశ మందిరంలో మెదక్ పార్లమెంట్ నియోజకవర్గ నోడల్ అధికారులు, ఎస్ఎస్‌టీ, ఎఫ్ఎస్‌టీ, వీవీటీ టీమ్ సభ్యులు, ఎన్నికల అధికారులతో సమీక్షా సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ నియోజకవర్గంలోని 7 అసెంబ్లీ సెగ్మెంట్లలో సహాయ వ్యయ పరిశీలన అధికారులతో సమన్వయం చేసుకుని ఆర్వో స్థాయిలో రోజూ వ్యయ నివేదికలు క్రోఢీకరించుకోవాలన్నారు. అకౌంటింగ్ టీంలు వివరాలు నమోదు చేయాలన్నారు. ఎన్నికల సంఘం నిబంధనలు కచ్చితంగా పాటిస్తూ పోటీలో ఉన్న అభ్యర్థుల ప్రతి ఖర్చు వివరాలను సెగ్మెంట్ల వారిగా నమోదు చేయాలన్నారు. ర్యాలీలు, బహిరంగ సభలు, సమావేశాలు, రోడ్ షోలు అన్నింటినీ వీడియో సర్వేలెన్స్ టీం సభ్యులు రికార్డింగ్ చేసి పరిశీలన సభ్యుల ద్వారా వివరాలను అకౌంటింగ్ టీం సభ్యులతో సమన్వయం చేసుకుని, షాడో అబ్జర్వేషన్ రిజిస్టర్‌లో తప్పకుండా నమోదు చేసి, పూర్తి వివరాలను రిటర్నింగ్ అధికారికి సమర్పించాలన్నారు.

నిర్ణయించిన ధరల ప్రకారం నమోదు చేయాలి

అనంతరం రిటర్నింగ్ అధికారి రాహుల్ రాజ్ మాట్లాడుతూ.. ర్యాలీలు, సమావేశాలు ద్వారా నిర్వహించిన పార్టీ, ప్రచార ఖర్చులు నిర్ణయించిన ధరల ప్రకారం నమోదు చేయాలన్నారు. పోటీ చేసే అభ్యర్థులు తమ ప్రచార ఖర్చుల అకౌంట్లు, రిజిష్టర్లు సక్రమంగా నిర్వహించాలన్నారు. నామినేషన్ వేసిన తర్వాత ఎన్నికల సందర్భంగా, అనంతరం పరిశీలన చేయనున్నారని, పరిశీలనకు మధ్య మూడు రోజుల వ్యవధి ఉండాలని స్పష్టంచేశారు. ప్రతి వాహనాన్ని క్షుణ్ణంగా పరిశీలించాలన్నారు. డబ్బు, మద్యం ఇతర వస్తువుల పంపిణీపై ప్రత్యేక దృష్టి సారించాలన్నారు. సమావేశంలో ఎస్పీ బాలస్వామి, అదనపు కలెక్టర్ వెంకటేశ్వర్లు, సిద్దిపేట అదనపు కలెక్టర్ గరిమా అగర్వాల్, అదనపు ఎస్పీ మహేందర్, ఏఆర్‌వోలు, ఎన్నికల సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

పరిస్థితి విషమించి యువకుడు మృతి

సురేశ్ (ఫైల్)

చేగుంట, ఏప్రిల్ 19: రోడ్డు ప్రమాదంలో తీవ్రంగా గాయపడి, చికిత్స పొందుతూ పరిస్థితి విషమించడంతో యువకుడు మృతి చెందిన ఘటన చేగుంట పోలీస్‌స్టేషన్ పరిధిలో శుక్రవారం జరిగింది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. మండలంలోని కురుల గ్రామంలో నివాసముంటున్న సురేశ్ మహారాష్ట్రలోని నాందేడ్ జిల్లా ఖందార్ మండలానికి చెందినవాడు. ఈ నెల 14న చేగుంటకు దిచక్ర వాహనంపై వచ్చి కూరగాయాలు తీసుకుని తిరిగి వెళ్తుండగా రుక్మాపూర్ శివారులో అతివేగంగా వచ్చిన మరో బైక్ ఢీకొట్టింది. దీంతో సురేశ్ తలకు తీవ్రగాయాయ్యయి. సురేశ్‌ను 108 అంబులెన్స్‌లో చికిత్స నిమిత్తం గాంధీ దవాఖానకు తరలించారు. శుక్రవారం చికిత్స పొందుతూ పరిస్థితి విషమించడంతో మృతి చెందాడు. మృతుడి తండ్రి అశోక్ దావలె ఫిర్యాదు మేరకు చేగుంట పోలీసులు కేసు నమోదు చేసుకుని, మృతదేహాన్ని పోస్టుమార్టం చేయించి, కుటుంబ సభ్యులకు అప్పగించారు. కేసు దర్యాప్తులో ఉన్నదని ఎస్సై బాల్‌రాజు తెలిపారు.

నాణ్యతా ప్రమాణాలు పాటించాలి

నిజాంపేట సబ్ మార్కెట్ యార్డులో రైతులతో మాట్లాడుతున్న అదనపు కలెక్టర్ వెంకటేశ్వర్లు

- రైతులకు టార్పాలిన్లు అందుబాటులో ఉంచాలి
- అదనపు కలెక్టర్ వెంకటేశ్వర్లు

నిజాంపేట, ఏప్రిల్ 19: ధాన్యాన్ని కొనుగోలు కేంద్రాలకు తరలించే రైతులు నాణ్యతా ప్రమాణాలు పాటించాలని అదనపు కలెక్టర్ వెంకటేశ్వర్లు అన్నారు. శుక్రవారం నిజాంపేట సబ్ మార్కెట్ యార్డులో పీఏసీఎస్ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన కొనుగోలు కేంద్రాన్ని ఆయన సందర్శించి, రైతులతో మాట్లాడారు. జిల్లా వ్యాప్తంగా ఏర్పాటు చేసిన 410 ధాన్యం కొనుగోలు కేంద్రాల ద్వారా 5 వేల మెట్రిక్ టన్నుల ధాన్యాన్ని సేకరించినట్లు తెలిపారు. అకాల వర్షాల కారణంగా ధాన్యం తడవకుండా రైతులకు టార్పాలిన్లు అందుబాటులో ఉంచాలని కొనుగోలు కేంద్రం సిబ్బందికి సూచించారు. ధాన్యం తూకం వేసిన మూడు రోజుల్లో డబ్బులు రైతుల ఖాతాలో జమ చేస్తామన్నారు. కార్యక్రమంలో పీఏసీఎస్ చైర్మన్ బాపురెడ్డి, సీఈవో శోభారాణి, సిబ్బంది మహిపాల్, రమేశ్, రైతులు మల్లేశం, శ్రీశైల్లం, రాములు తదితరులు పాల్గొన్నారు.

దళారులకు అమ్మి మోసపోవద్దు

మాచవరంలో కొనుగోలు కేంద్రాన్ని పరిశీస్తున్న ఏవో శ్రీనివాస్, శ్రీనివాస్ చౌదరి

మెదక్‌రూరల్, ఏప్రిల్ 19: ధాన్యాన్ని దళారులకు అమ్మి రైతులు మోసపోవద్దని, ప్రభుత్వం ఏర్పాటు చేసిన కొనుగోలు కేంద్రాల్లోనే విక్రయించాలని మండల వ్యవసాయాధికారి శ్రీనివాస్ అన్నారు. శుక్రవారం మండలంలోని మాచవరం ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని ఏఈవో రాజశేఖర్, నాయకుడు శ్రీనివాస్ చౌదరితో కలిసి ఏర్పాట్లను పరిశీలించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ కోనుగోలు కేంద్రంలో రైతులకు ఇబ్బందులు కలిగించవద్దన్నారు. వండ్లు ఎండబోసి తాలు లేకుండా తేమ 17 శాతానికి మించకుండా ధాన్యాన్ని కేంద్రాలకు తీసుకురావాలని రైతులకు సూచించారు.

తాగునీటి సమస్య రాకుండా చూడాలి

నర్సాపూర్ రెండో వార్డులో పైపులైన్‌ను మరమ్మతు చేయిస్తున్న మున్సిపల్ చైర్మన్ అశోక్‌గౌడ్

నర్సాపూర్, ఏప్రిల్ 19: నర్సాపూర్‌లోని వార్డుల్లో నీటి సమస్య తలెత్తకుండా చూడాలని మున్సిపల్ చైర్మన్ అశోక్‌గౌడ్ అధికారులను ఆదేశించారు. శుక్రవారం నర్సాపూర్ మున్సిపల్‌లోని పీర్లగుట్టపై గల వాటర్ ట్యాంక్‌ను పరిశీలించారు. ట్యాంక్‌ను, పరిసరాలను శుభ్రం చేయించారు. రెండో వార్డులోని ఎన్జీవోస్ కాలనీలో పైపులైన్లను మరమ్మతులు చేయించారు. అనంతరం మున్సిపల్ చైర్మన్ అశోక్‌గౌడ్ మాట్లాడుతూ వేసవిని దృష్టిలో పెట్టుకుని నీటిని పొదుపు చేయాలని సూచించారు. వార్డుల్లో నీటి సమస్య తలెత్తితే మున్సిపల్ కార్యాలయానికి సమాచారం అందించాలన్నారు. ఆయనతో కౌన్సిలర్లు లతారమేశ్‌యాదవ్, కుజ్రత్ అలీ తదితరులు ఉన్నారు.

కొనుగోళ్లు లేక.. కేంద్రం మూత

ఇబ్బందులు పడుతున్న చేగుంట సొసైటీలోని నాలుగు గ్రామాల రైతులు

మూసి ఉన్న చేగుంట సొసైటీలో ఏర్పాటు చేసిన కొనుగోలు కేంద్రం

చేగుంట, ఏప్రిల్ 19: చేగుంట సొసైటీలో చేగుంట, వడియారం, అనంతసాగర్, ఉల్లితి మ్మాయిపల్లి గ్రామాలున్నాయి. ఈ సొసైటీ పరిధిలో కొనుగోలు కేంద్రాన్ని ఏర్పాటుచేశారు. కొనుగోలు కేంద్రాన్ని కొబ్బరి కాయలు కొట్టి ప్రారంభించారు. ఆ కేంద్రంలో సరైన సౌకర్యాలు కల్పించలేదు. దీంతోపాటు హమాలీల కొరత వేధిస్తున్నది. అక్కడికి రైతులు ధాన్యం తీసుకొచ్చినా దించి, తూకం వేసేందుకు హమాలీలు లేరు. దీంతో ఆ కేంద్రానికి ధాన్యం రావడం లేదని తాళం వేశారు నిర్వాహకులు. కేంద్రం నిర్వాహకులను సంప్రదించగా ధాన్యం రావడం లేదని, అందుకే మూసేశామని తెలిపారు. ప్రభుత్వం ఏర్పాటు చేసిన కొనుగోలు కేంద్రాల్లో ధాన్యం అమ్ముదామంటే హమాలీలు లేక వ్యాపారుల వద్దకు తీసుకెళ్లి విక్రయించాల్సి వస్తున్నదని రైతులు వాపోయారు.

భక్తిశ్రద్ధలతో పెద్దమ్మ తల్లికి పూజలు

చేగుంట, ఏప్రిల్ 19: మండలంలోని బీ కొండపూర్‌లో గ్రామ ముదిరాజ్ సంఘం ఆధ్వర్యంలో పెద్దమ్మ తల్లి జాతర ఘనంగా నిర్వహిస్తున్నారు. శుక్రవారం బీఆర్ఎస్ నాయకుడు రంగయ్యగారి రాజిరెడ్డి ప్రత్యేక పూజలు చేశారు. కార్యక్రమంలో ఆలయ కమిటీ సభ్యులు తలారి ఎల్లం, గడిల రమేశ్, సాయిలు, నరేశ్, మహేశ్ పాల్గొన్నారు.

దివ్యాంగులు, వృద్ధులకు ఇంటి నుంచే ఓటు

నర్సాపూర్, ఏప్రిల్ 19: దివ్యాంగులు, వృద్ధులకు ఇంటి నుంచే ఓటేసే సదుపాయాన్ని కల్పించినట్లు ఆర్డీవో జగదీశ్వర్‌రెడ్డి ఒక ప్రకటనలో తెలిపారు. మే 3 నుంచి వృద్ధులు, దివ్యాంగులు ఇంటి వద్దే ఓటేసేందుకు ఏర్పాట్లు చేసినట్లు పేర్కొన్నారు. నర్సాపూర్ నియోజకవర్గంలో ఇది వరకే బీఎల్‌వోలు ఇంటింటికీ వెళ్లి వృద్ధులు, దివ్యాంగుల వివరాలు సేకరించారు. ఇంకా ఎవరైనా ఉంటే ఈ నెల 24వ తేదీ వరకు సంబంధిత బీఎల్‌వోకు దరఖాస్తు సమర్పించవచ్చని సూచించారు. 85 ఏండ్లు దాటిన వృద్ధులు, దివ్యాంగులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని తెలిపారు.